క్లుప్తంగా

అయ్యప్పస్వామికి సహస్ర కలశాభిషేకం



నరసరావుపేట ఈస్ట్: శబరిమల అయ్యప్పస్వామి మండల పూజను పురస్కరించుకొని గురువారం పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలపాడురోడ్డులోని శ్రీమహాశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి సహస్ర కలశ అభిషేకం నిర్వహించారు. అర్చకులు హరికృష్ణశర్మ ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ, నిత్య అర్చన, విశేష హోమాదులు పూజలు జరిపారు. మధ్యాహ్నం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి సాయంత్రం లక్ష భస్మార్చన, రాత్రి మహా మంగళ హారతి సమర్పించారు. కాగా, శుక్రవారం ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, అష్టాభిషేకం, దివ్య పదునెట్టాం పడి పూజ నిర్వహించనున్నట్లు హరికృష్ణశర్మ తెలిపారు. అలాగే సత్తెనపల్లిరోడ్డులోని శ్రీఅయ్యప్ప స్వామి ఆలయం, ఎస్ఎస్‌పీ కాలనీ అయ్యప్ప స్వామి ఆలయాలలో స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు.

సౌత్ జోన్ స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థులు



నరసరావుపేట ఈస్ట్: శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు 35వ సౌత్ జోన్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్. సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూధన్‌రావు గురువారం తెలిపారు. విశాఖపట్టణంలో నిర్వహించిన తొమ్మిదవ రాష్ట్ర స్థాయి శీతాకాలపు జూనియర్స్ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలలో తమ విద్యార్థులు వై. మధుకిషోర్, కె. సాకేత్‌లు ప్రతిభ చూపి సౌత్ జోన్ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్తా, ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. శ్రీనివాస సాయి, అధ్యాపకులు అభినందించారు.

ఉచిత వైద్యశిబిరం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొత్తపేట నందు గల కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బ్యాంక్ ఆవరణలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ జె. అరవింద్‌బాబు మాట్లాడుతూ కోస్టల్ బ్యాంక్ 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ పీవీ చలపతిరావు, దంత వైద్యులు ఘంటసాల నవీన్‌కుమార్‌లచే ఖాతాదారులకు వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. అనంతరం ఖాతాదారులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పెనుగొండ శివప్రసాదరావు, గజవల్లి నాగపవన్‌కుమార్, చందోలు చిన్న నరసయ్య, వెంకటేశ్వర శర్మ, రఫీ, బ్యాంక్ సిబ్బంది డి.సీహెచ్. వెంకటేశ్వర్లు, సయ్యద్ నాగూర్‌బి, కొల్లి హరిబాబు, షేక్ గౌసియా, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



ఖాదర్ బాషా

రొంపిచర్ల: మండలంలోని మాచవరం గ్రామంలో విద్యుదాఘాతానికి గురైన విప్పర్ల గ్రామానికి చెందిన షేక్ పమిడిమర్రి ఖాదర్ బాష (22) మృతి చెందాడు. ఖాదర్ భాషా మాచవరం గ్రామంలో కేబుల్ సంబంధించిన పనులు చేస్తుంటాడు. రోజు వారి కేబుల్ మరమ్మతుల పనుల్లో భాగంగా గ్రామంలో తిరుగుతున్నాడు. ఓ ఇంట్లో విద్యుత్ మోటారు పనిచేయక పోవటంతో రిపేర్ ప్రారంభించారు. ఆ సమయంలో విద్యుదాఘాతమై బావిలో పడి ఖాదర్ బాష మృతి చెందాడు. గ్రామస్తులు అక్కడికి చేరుకొని విద్యుత్ సరఫరాను నిలిపి వేసి బావిలో పడిపోయిన ఖాదర్ బాషను బయటకు తీశారు. అప్పటికే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. విప్పర్ల గ్రామంలోని మృతుడి కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలియటంతో కన్నీ రు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడు ఖాదర్ బాషకు వివాహం కాలేదు. విప్పర్ల, మాచవరం గ్రామాల్లో సుపరిచితుడుగా ఉంటూ రోజు అందరితో కలియతిరిగే భాషా మృతి రెండు గ్రామాల్లో విషాద ఛాయలు నెలకొన్నాయి.

రెవెన్యూ సదస్సుకు ఆరు అర్జీలు

రొంపిచర్ల: మండలంలోని తురిమెళ్ల గ్రామంలో గురువారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సభకు మొత్తం ఆరు అర్జీలు అందాయని మండల తహసీల్దార్ బండి నిర్మల తెలిపారు. ఆన్‌లైన్‌లో అడంగల్ నమోదు కొరకు మూడు దరఖాస్తులు రాగా, తమ పొలాలను సర్వే చేయించాలని రెండు దరఖాస్తులు, సబ్ డివిజన్ చేయించాలని ఒక దరఖాస్తు అందించారు.

వివాదాలకు కేరాఫ్.. మిద్దెబావి స్థలాలు

- అక్రమార్కులకు ఆదాయ వనరుగా మార్చుకున్న వైనం
- నకిలీ పత్రాలు సృష్టించి అమ్ముకుంటున్న అక్రమార్కులు
- 947 మంది ప్లాట్లలో గందగోళం
- కమ్యూనిటీ స్థలాలను కబ్జాచేసిన వైనం



అక్రమార్కులు తయారు చేసిన నకిలీ పట్టా

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో మిద్దెబావి స్థలాలు వివాదాలకు నిలయంగా మారాయి. 1999లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో 946 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. మౌలిక వసతులు కల్పించక పోవటంతో అప్పటి నుంచి కొంతకాలంపాటు లబ్ధిదారులు పెద్దగా నిర్మాణాలు చేయలేదు. రానురాను లబ్ధిదారులు ఒక్కొక్కరుగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇక్కడి నుంచే సమస్యలు మొదలయ్యాయి. ఇళ్లు కట్టుకుని వారి స్థలాలు కబ్జాకు గురయ్యాయి.


కొంత మంది అక్రమార్కులు లబ్ధిదారుల పేర్లతో దొంగపట్టాలు సృష్టించి వందల కొద్దీ నకిలీ పట్టాలు తయారు చేసి అమ్ముకున్నారు. దీంతో అసలు లబ్ధిదారులు కంటే నకిలీ వారే ముందుగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో నిత్యం గొడవలు జరుగున్నాయి. 947 మంది లబ్ధిదారుల్లో కొంతమంది ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు అమ్ముకోవడంతో సమస్యలు మరింత పెరిగాయి.



మిద్దెబావి వద్ద నివాస గృహాలు

అనంతర కాలంలో 2009లో అధికారులు లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారనే సర్వే చేసి సుమారు 400 మంది పొజిషన్‌లో లేరని గుర్తించి మళ్లీ కొంత మందికి లేనివారి స్థానంలో పట్టాలు మంజూరు చేశారు. ఇదే అదునుగా చేసుకున్న కొందమంది అక్రమార్కులు ఏకంగా మారిపోయిన అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి మరీ నకిలీ పట్టాలు సృష్టించి అమ్ముకున్నారు. అదే ప్రక్రియ నేటికీ కొనసాగుతుండటంతో అసలైన లబ్ధిదారులకు మాత్రం న్యాయం జరుగలేదు.

ఎన్నో ఏళ్ల సమస్య..



1999లో మంజూరు చేసిన మ్యాప్

గతంలో ఇళ్లస్థలాలు కోసం కేటాయించిన భూమిలో కమ్యూటీ హాలు, పార్కు, ఇతర అవసరాలకు అక్కడక్కడా ప్రభుత్వం స్థలాన్ని వదలిపెట్టారు. తాజాగా అక్రమార్కుల కన్ను కమ్యూనిటీ స్థలాలపై పడింది. ఏకంగా కమ్యూటీ స్థలాలను కూడా ఆక్రమంచి ప్లాట్లుగా మార్చి అమ్ముకున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తుండటంతో సమస్యలు మరింత జటిలమౌతున్నాయి. స్థలాల వివాదాలతో పోలీసులు రెవెన్యూ అధికారుల చుట్టూ న్యాయంకోసం తిరితిరిగి లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిరుపేదలకు స్థలాలు ఇవ్వాలి



గతంలో పట్టాలిచ్చిన లబ్ధిదారుకు మాత్రం అధికారులు న్యాయం చేయాలి. స్థానికంగా లేనివారిని గుర్తించి ప్రస్తుతం ఇళ్లులేని నిరుపేదలకు స్థలాలు కేటాయించాలి. ఈ విషయమై గతంలో రెవెన్యూ అధికారులకు పలుమార్లు విన్నవించాం. స్పందించని పక్షంలో లబ్ధిదారులతో కలసి పోరాటం చేస్తాం.

–తోటాంజనేయులు, సీపీఐఎం లిబరేషన్ నాయకులు

అక్రమాలకు పాల్పడితే సహించం



మిద్దెబావి స్థలాలల్లో అక్రమాలు మా దృష్టికి వచ్చాయి. సమస్యలపై రెవెన్యూ సిబ్బందితో ఇటీవల సర్వేచేపట్టాం. అసలు లబ్ధిదారులు ఎంత మంది ఉన్నారన్న విషయంపై స్పష్టత వచ్చింది. రెవెన్యూ సదస్సులు పూర్తయిన అనంతరం అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం. కమ్యూనిటీ స్థలాలు ఆక్రమణకు గురైనా తిరిగి స్వాధీనం చేసుకుంటాం.

– సురేష్‌నాయక్, తహసీల్దార్

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

శావల్యాపురం: గ్రామసచివాలయ సిబ్బంది గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాలు పొందే వారందరి సమగ్ర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్స్‌లకు గ్రామాల్లో మిగిలిపోయిన పౌరులను వారి ఇళ్లకు అనుసంధానం పురోగతిపై సమీక్షించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో ఇప్పటి వరకు 3495 మంది లబ్ధిదారులు నమోదు చేయాల్సి ఉందన్నారు. ఆన్‌లైన్‌లో సమగ్ర వివరాలు నమోదు చేయకపోతే భవిష్యత్‌లో వీరందరు ప్రభుత్వ పథకాలు కోల్పోవుతారన్నారు. గ్రామాల వారిగా లబ్ధిదారులను గుర్తించి తక్షణమే నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం యాప్‌లో లబ్ధిదారుల బదిలీ చేయు విధానంతో పాటు మరణాలు తదితర వివరాలు కూడ గుర్తించాలన్నారు.

రెవెన్యూ సదస్సుకు ఎనిమిది అర్జీలు

నాదెండ్ల: నాదెండ్ల 1, 2 సచివాలయాల పరిధిలో గురువారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సుకు తహసీల్దార్ ఏవీ రమణ, సర్వేయర్ రాంబాబు, డీటీ ధనలక్ష్మీ హాజరయ్యారు. రైతుల నుంచి ఎనిమిది అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ వీఆర్‌వోలు రాజు, అబ్దుల్‌బాషా, గ్రామ సర్వేయర్లు ఉన్నారు.

ఫసల్ బీమాలో నమోదు చేయించుకోవాలి

నాదెండ్ల: రబీలో సాగు చేసిన వరికి ప్రధానమంత్రి ఫసల్‌భీమా యోజన క్రింద పంటల బీమా చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్ చెప్పారు. ఈ నెల చివరితో గడువు ముగుస్తుందన్నారు. సాతులూరు గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సాగుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఫ్యూచర్ జనరల్ కంపెనీ జిల్లా మేనేజర్ లింగయ్య, గ్రామ ఉపసర్పంచ్ శరభయ్య, వీఏఏలు వేణుగోపాల్, రామారావు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచి మోసం చేశారు

- వెంటనే ఉపసంహరించుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి డిమాండ్
- నేడు వైఎస్సార్ సీపీ పోరుబాటలో పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొనాలని పిలుపు
- అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోండి



పోరుబాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పి తీరా అధికారం చేపట్టాక చార్జీలను పెంచి రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మోసం చేశాడని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ కూటమి పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే వెనక్కి తీసుకోవాలనే డిమాండ్‌తో శుక్రవారం నిర్వహించే వైఎస్సార్‌సీపీ పోరుబాటను పురస్కరించుకొని గురువారం గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆది నుంచి చంద్రబాబు పోకడలను దుయ్యబట్టారు. చంద్రబాబుకు ఎప్పుడు ఎన్నికల హామీలను నెరవేర్చే ఉద్దేశం ఉండదన్నారు. కేవలం హామీలు గుప్పించి ఓట్లు వేయించుకోవడం, ఆ తర్వాత వాటిని విస్మరించడం ఆయన నైజమన్నారు. విద్యుత్ చార్జీలు పెంచనని, ఇంకా తగ్గిస్తానని కడప, భీమవరం, పులివెందుల సభల్లో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని కూడా పేర్కొన్నారన్నారు.

కానీ ఆర్నెల్లు గడవకుండానే రూ.15, 485 కోట్ల మేర పెంచాలని క్యాబినెట్ తీర్మానం చేయటం శోచనీయనీయమన్నారు. డిసెంబర్ నెలలో రూ.6 వేల కోట్లు, జనవరిలో మరో రూ.9485 కోట్లు మొత్తం రూ.15, 485 కోట్లు ప్రజల నెత్తిన విద్యుత్ భారాన్ని వేసేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అలాగే అకాల వర్షాలతో వరి, మిర్చి, కంది, పత్తి పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి అన్నారు. ప్రస్తుతం పంటల బీమాను ఈ ప్రభుత్వం అమలు చేయలేదని, ఇన్పుట్ సబ్సిడీ ఎప్పుడు వస్తుందో తెలియదని అన్నారు.

నేటి ఉదయం 10 గంటలకు...

తమ డిమాండ్ల సాధనకోసం శుక్రవారం ఉదయం 10గంటలకు పార్టీ కార్యాలయం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రం ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరూ ఈ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చిలకలూరిపేటలో...

చిలకలూలూరిపేట: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. విద్యుత్ ఏడీఈ కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి రజిని పాల్గొంటారని తెలిపారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కరెంటు చార్జీల పెంపుపై శుక్రవారం ఉదయం 10గంటలకు వినుకొండ పట్టణంలోని కారంపూడి రోడ్డులో గల కరెంటు ఆఫీస్ వద్ద నిరసన (పోరుబాట)కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

వంగవీటి మోహన్ రంగాకు ఘన నివాళి



రంగా విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, వంగవీటి శంతన్

నరసరావుపేట: దివంగత వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమాలను కాంగ్రెస్, జనసేన పార్టీ నాయకులు గురువారం నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ వంగవీటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించగా, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని గుంటూరురోడ్డులోని వంగవీటి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.


నాదెండ్ల: స్వర్గీయ వంగవీటి మోహనరంగా వర్ధంతిని పురస్కరించుకుని గురువారం గణపవరం పోలేరమ్మ గుడి సెంటర్‌లోని రంగా విగ్రహానికి పూలమాలలతో ఘన నివాళులు అర్పించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రంగా జోహార్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తులం సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, మాజీ ఎంపీటీసీ సుబ్బారావు, అంజి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహావిష్కరణ

నరసరావుపేట: దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతి సందర్భంగా పాతూరు శ్రీరస్తు కల్యాణ మండపం వద్ద ఏర్పాటుచేసిన నూతన వంగవీటి విగ్రహావిష్కరణ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ దాత, వీఎంఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏలూరి ప్రసాదు, స్థానిక కాపు సంఘ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, వంగవీటి శంతన్‌కుమార్, పాకనాటి రమాదేవి ముఖ్యఅతిథులుగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం అన్నదానం, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కాపు సంఘ నాయకులు పోతుల శంకర్, యతిరాజు రామ్మోహన్, బీజేపీ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణ, విగ్రహావిష్కరణ కమిటీ నాయకులు పాతూరి నాని, యేనుగుల సాంబ, షిరిడి శ్రీను, రామిశెట్టి వాసు, బుజ్జి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

- డిశ్చార్జి చేయటంలో రెండు గంటల ఆలస్యం
- ఈలోగా రోగి మృతి
- బంధువుల ఆందోళన



అంజమ్మ మృత దేహం వద్ద విలపిస్తున్న బంధువులు

నరసరావుపేటటౌన్: మహిళ మృతికి కారణమైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని మృతురాలి బంధువులు గురువారం పట్టణంలోని ప్రైవేటు వైద్యశాల ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యశాల్లో చికిత్స పొందుతూ నాగార్జున సాగర్ కుడికాలువ ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ గడిపుడి నరసింహారావు భార్య అంజమ్మ (55) మృతి చెందింది. విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు పెద్ద ఎత్తున వైద్యశాల వద్దకు చేరుకోవటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళన కారులకు నచ్చచెప్పి పరిస్థితిని చక్కదిద్దారు. రొంపిచర్ల మండలం వడ్లమూడివారిపాలెం గ్రామానికి చెందిన గడిపుడి అంజమ్మ గుండె సంబంధిత సమస్యతో బుధవారం రాత్రి ప్రకాష్‌నగర్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాల్లో చేరింది. గురువారం మధ్యాహ్నం ఆమె పరిస్థితి విషమంగా ఉందని చెప్పి మెరుగైన వైద్య సేవల కోసం గుంటూరు తీసుకెళ్లాలని అంజమ్మ భర్త గడిపుడి నరసింహారావుకు సిబ్బంది సూచించారు. అంబులెన్స్‌ను సిద్ధం చేసుకొని ఆమెను డిశ్చార్జి చేయాలని కుటుంబ సభ్యులు కోరారు. అయితే డిశ్చార్జి చేసేందుకు రెండు గంటల సమయం పట్టింది. ఈలోగా అంజమ్మ మృతి చెందింది.

విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో వైద్యశాల వద్దకు చేరుకున్నారు. పేషంట్‌కు సీరియస్‌గా ఉంటే వైద్యులు, సిబ్బంది ఎందుకు అలసత్వం వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ సమయంలో సిబ్బందిపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ విజయచరణ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులను నచ్చజెప్పారు. జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ వారికి హామీ ఇచ్చారు.

• వానరానికి అంత్యక్రియలు



గ్రామంలో తిరిగే కోతి మృతి చెందడంతో గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించిన ఘటన మండలంలోని జొన్నలగడ్డలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు గత కొంతకాలంగా కోతి ఒకటి గ్రామంలోనే తిరుగుతోంది. అయితే ఈ కోతి గురువారం మృతి చెందింది. దీంతో గ్రామస్తులు కోతికి సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. మేళ తాళాలతో ఊరేగింపు జరిపి దహన సంస్కారాలు పూర్తిచేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

–నరసరావుపేట రూరల్


రేపు పలు ప్రాంతాల్లో మంచి నీటి సరఫరా ఉండదు

చిలకలూరిపేట: పురపాలక సంఘ పరిధిలోని చెరువురోడ్డు నందు సింగ్ నగర్ నుంచి మదర్‌థెరిస్సా కాలనీ వరకు రా వాటర్ పంపింగ్ మెయిన్ పైపులైన్‌కు పలు చోట్ల లీకులు ఏర్పడ్డాయని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు తెలిపారు. ఈ నేపథ్యంలో పైపులైన్ మరమత్తుల కారణంగా ఈ నెల 28వ తేదీన ఉదయం 9గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పట్టణంలోని సుభానినగర్, రాగన్నపాలెం, పురుషోత్తమపట్నం, మార్కెండేయనగర్, భవనారుషినగర్ ప్రాంతాలలో నీటి సరఫరా పాక్షికంగా మాత్రమే ఉంటుదన్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు గ్రామస్తుడు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన వడ్లమూడి వెంకట సుబ్బయ్య గురువారం ఇంటిపైకి ఎక్కి పనులు చేస్తున్నాడు. అయితే ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుదాఘాతమైంది. దీంతో డాబా పైనుంచి కింద పడిపోవటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. హుటాహుటిన వినుకొండ వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమించింది. దీంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. ఈవిషయంపై పోలీసులకు వివరణ కోరగా వాస్తవమేనన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

టైరు పేలి.. వాహనం బోల్తా



యడ్లపాడు: ఎక్స్‌ప్రెస్ హైవేపై ప్రయాణిస్తున్న ఆటో టైరు పేలడంతో పెనుప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపుకు బిర్లావైట్ సిమెంట్ లోడుతో వెళ్తున్న ఫోర్‌వీల్ ఆటో ప్రమాదవశాత్తు బైక్‌టైర్ పేలిపోయింది. యడ్లపాడు పోలీస్‌స్టేషన్ సమీపంలో 16వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన ఈ ఘటనతో ఆటో బోల్తా పడింది. అయితే ఆ సమయంలో రహదారిపై వాహనాలు ఏమీ లేకపోవడం, పల్టీకొట్టిన సదరు ఆటోలో ఉన్న డ్రైవర్‌కు సైతం గాయపడలేదు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సత్వరమే స్పందించి సంఘటనా స్థలికి చేరుకున్నారు. రహదారికి అడ్డంగా పడిన ఆటోను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఘనంగా సీపీఐ శతవసంత వేడుకలు

నరసరావుపేట ఈస్ట్: భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) శతవసంతాలను పురస్కరించుకొని అరండల్ పేటలోని పార్టీ కార్యాలయం వద్ద అరుణ పతాకాలను ఆవిష్కరించారు. పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, పార్టీ సీనియర్ నాయకులు ఎం. విజయలక్ష్మీ, శ్యామల వెంకటేశ్వరరెడ్డి, చిట్యాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ(నూజెండ్ల): రైతు కూలీలకు, కార్మికులకు అండగా నిలిచింది కమ్యూనిస్టు పార్టీయే అని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శివయ్యస్థూపం సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది పీజే లూకా, సీపీఐ నాయకులు బూదాల శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, సంగ్రపాటి సైదా, చంద్రజిత్‌యాదవ్, శ్రీనివాస్, పఠాన్ లాల్‌ఖాన్, వెంకటేశ్వర్లు, వందనం, ఎ.పవన్‌కుమార్, కిషోర్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

చిలకలూరిపేట: పార్టీ స్థాపించిన వద్ద నుంచి నేటి వరకు పేదల పక్షాన నిలబడి పోరాటం చేసింది భారత కమ్యూనిస్టు పార్టీ అని ఆ పార్టీ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు చెప్పారు.

నేడు యడ్లపాడులో రెవెన్యూ గ్రామసభ

యడ్లపాడు: భూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జెట్టి విజయశ్రీ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ మండలం పరిధిలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లోనూ గ్రామసభలను నిర్వహిస్తున్నామని, శుక్రవారం విశ్వనాథ కండ్రిక రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ సదస్సు యడ్లపాడు గ్రామ సచివాలయం –2 ప్రాంగణంలో కొనసాగుతుందన్నారు.

న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

శావల్యాపురం: నూతన సంవత్సరం వేడుకలు ప్రశాంతమైన వాతావరణంలో ప్రతి ఒక్కరు జరుపుకోవాలని ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక పోలీసు స్టేషనులో ఎస్సై మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అదేశాలు మేరకు ట్రాఫిక్ నిబంధనలు అందరు పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ ధరించకపోయిన చట్ట ప్రకారం అటువంటి వారిపై ఆపరాధరుసుం విధిస్తామన్నారు.